క్లుప్తంగా

చురుగ్గా ప్రభుత్వ భవన నిర్మాణాలు



కోడుమూరులో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయం

కోడుమూరు రూరల్ : మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలో మొత్తం 21 గ్రామ సచివాలయాలు, 21 రైతు భరోసా కేంద్రాలు, 17 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు పులకుర్తి గ్రామంలో 2 గ్రామ సచివాలయాలు, లద్దగిరి, వర్కూరు, వెంకటగిరి, ప్యాలకుర్తి గ్రామాల్లో ఒకటి చొప్పున గ్రామ సచివాలయాలు పూర్తయ్యాయి. మిగిలిన వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ గంగరాజు చెప్పారు. అలాగే ఆయా నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టర్లకు పూర్తి స్థాయిలో బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించినట్లు ఏఈ గంగరాజు పేర్కొన్నారు.

కేసీ కాల్వకు 130 క్యూసెక్కులు విడుదల

గూడూరు: సుంకేసుల డ్యామ్ నుంచి కర్నూలు నగర ప్రజలకు తాగు నీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచి పోయిందని, డ్యామ్‌లో 0.845 టీఎంసీల నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

కొత్తూరుకు వీఐపీల తాకిడి



ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబును సన్మానిస్తున్న, అర్చకులు, సిబ్బంది

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం వీఐపీల తాకిడితో కిటకిటలాడింది. కర్నూలు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధర్‌బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కల్యాణి, నంద్యాల సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, తెలంగాణ రాష్ట్ర గద్వాల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రభాకర్, అలాగే మై హోమ్ జీఎం (మహా సిమెంట్)శివ ప్రసాద్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. వారికి అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేయించి, స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, సురేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు

ముమ్మరంగా ఓటర్ల సర్వే



మద్దూరులో సర్వే చేస్తున్న వీఆర్‌ఓ శ్రీనివాసులు

పాణ్యం : మండలంలో ఓటర్ల సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఆదివారం ప్రత్యేక క్యాంపైన్ నిర్వహించడంతో అధికారులు, ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఇంట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు, వారి వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా, ఏమైన మార్పులు చేర్పులు అవసరమా, అలాగే కొత్తగా ఓటుకు నమోదు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. మండలంలో మొత్తం 19 పంచాయతీలు ఉండగా 43 మంది బీఎల్‌ఓలు సర్వేలో పాల్గొన్నారు.

నేడు ఉల్చాలలో 'జగనన్న సురక్ష'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఈ నెల 24వ తేదీ సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేపీ అజాంఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

అనుమతిలేకుండా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : అనుమతి లేకుండా లేఅవుట్ల యజమానులు రోడ్లకు మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా మైనింగ్ కార్యాలయంలో లే అవుట్ యజమానుల సంఘం (క్రెడై, కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ ఆఫ్ డెవలపర్స్ ఆఫ్ ఇండియా) నాయకులతో సమావేశం నిర్వహించారు. మట్టి తీసుకెళ్లేందుకు తాము రాయల్టీ చెల్లిస్తామని అనుమతి ఇవ్వాలని ఆ సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాసులు కోరారు.

సిరుల పంట సోయాబీన్

- ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- మండలంలో 8 వేల ఎకరాలకు పైగా సాగు
- ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ
- 90 రోజుల్లో పంట చేతికి

గడివేముల: మండలంలో వాణిజ్య పంటల సాగుపై దృష్టి పెట్టిన రైతులు సోయాబీన్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సాగులో మెలుకువలు, రైతు భరోసా కేంద్రాల నుంచి ఇస్తున్న సహకారం, ప్రభుత్వం మద్దతు ధర, వర్షాలు కూడా అనుకూలిస్తుండటంతో గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు.

తక్కువ పెట్టుబడి.. తక్కువ కాల వ్యవధి

మండలంలో మొత్తం పంటల సాగు విస్తీరణం 34,382 ఎకరాలు. కాగా ఖరీఫ్‌లో దాదాపు 24 వేల ఎకరాల్లో సోయబీన్, పత్తి, మిరప, మొక్కజొన్న పంటలు అధికంగా సాగు చేసే అవకాశం ఉంది. మండలంలోని బూజునూరు, పెసరవాయి, బిలకలగూడూరు, కరిమద్దెల, చిందుకూరు, గడివేముల గ్రామాల్లో సోయాబీన్ పంటను అధికంగా సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో దాదాపు 8 వేల ఎకరాల వరకు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో పంట చేతికి వస్తుండటంతో రైతులు సోయాబీన్‌ను ఎన్నుకున్నారు. ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు.

వర్షాల ప్రభావం ఉండదు..

వర్షాలు తక్కువ కురిసినా, ఎక్కువ కురిసిన పంట దిగుబడి తగ్గదు. పంట 90 నుంచి 100 రోజుల్లో



బూజునూరు గ్రామంలో కళకళలాడుతున్న సోయాబీన్ పంట

పంట చేతికి వస్తుంది. పంటకు దోమల బెడద తక్కువగా ఉంటుంది. సోయాబీన్ పంటకు పురుగు మందులు ఎక్కువ వాడాల్సిన అవసరం లేదు. పంట చేతికి వచ్చిన తరువాత మళ్లీ పంట వేసుకోవడానికి వీలుటుంది. సోయాబీన్ క్వింటా రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పలుకుతుంది.

లాభాలు వస్తున్నాయి



రైతులంతా సోయాబీన్ సాగుపైనే దృష్టసారిస్తున్నారు.నేను నాకు ఉన్న 5 ఎకరాల పొలంతో సోయాబీన్ పంటను సాగుచేశాను.తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుంది. పంట సాగుకు కూలీలతో,పెట్టుబడి తక్కువగా ఉంటుంది. వర్షాలు పడుతుంటడంతో పంట బాగా వచ్చే అవకాశం ఉంది.దీంతో బాగా లాభాలు లభించే అవకాశం ఉంది. – సర్వేశ్‌రెడ్డి, రైతు, అల్లగడ్డ గ్రామం

పెట్టుబడి ఖర్చు తక్కువ



నాకున్న 6.50 ఎకరాలలో సోయాబీన్ పంటను సాగు చేశాను. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో అధికారులు రైతులకు సలహాలు సూచనలు చేస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి నెలరోజుల వరకు ఎటువంటి చీడపీడలు రావు. 30 రోజుల అనంతరం మొదటి రౌండ్ ,55 నుంచి 65 రోజుల్లో రెండవ రౌండ్ పురుగుమందు పిచికారీ చేస్తాం . కోత మిషన్‌తో పంటను కోత కోసి ఆరబెట్టి అమ్ముతాము. దీంతో సాగు ఖర్చులు తగ్గుతాయి. – పైపాలెం ఉశేన్, గడివేముల గ్రామం

సోయాబీన్ సాగుపై ఆసక్తి



మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సోయాబీన్ పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఏడాది రెండు నుంచి మూడు వేల ఎకరాలలో సోయాబీన్ పంటసాగు చేసేవారు. ఈ సీజన్‌లో దాదాపు 8 వేల ఎకరాల వరకు సాగు చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో పంటలు కళకళలాడుతున్నాయి. దిగుబడులు అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఈ క్రాప్ బుకింగ్ చేసుకుంటే నష్టపాయిన ప్రభుత్వం పరిహారం అందించేందుకు వీలుంటుంది. –హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- ఉలిందకొండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉలిందకొండ గ్రామంలో నాయకులు ఉలిందకొండ రమణారెడ్డి, రమణ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. త్వరలోనే గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని, ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజా రంజక పాలన

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా ప్రజా జనరంజాక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లబ్ధిని ప్రజలకు సకాలంలో అందించేలా కృషి చేస్తున్న వలంటీర్లు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, ఎంపీటీసీ అనురాధ, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, నాయకులు శీనయ్య, శ్రీనివాసులు, సత్యంరెడ్డి, ఈశ్వరయ్య, చాంద్‌బాషా, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓల ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌ఓలు

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరులోని 11, 12వ వార్డుల్లో ఆదివారం బీఎల్‌ఓలు ఓటరు జాబితా వేరిఫికేషన్ ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఎల్లప్ప, సత్యరాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితా వెరిఫికేషన్ సర్వే ఆగస్టు 20 వరకు జరుగుతుందన్నారు. తమ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితా మేరకు ఓటర్లు ఉన్నారా లేదా సర్వే చేయడంతో పాటు, చనిపోయిన ఓటర్లను, డబుల్ ఎంట్రీలను జాబితా నుంచి తొలగిస్తున్నామన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన వారికి కొత్త ఓటర్లుగా నమోదు చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే వాటిపై ఆయా ఫారాలల్లో ఓటర్ల నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఖాజీ నియామకం

గూడూరు: గూడూరు మండల ప్రభుత్వం ఖాజీగా పట్టణానికి చెందిన హాఫీజ్ జె.మహమ్మద్ హనీఫ్ నియమించబడ్డారు. ఆదివారం కర్నూలు జెడ్పీలో డీఎండబ్ల్యూ అధికారి సబిమా పర్వీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం అంజద్ బాషా, కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరయ్యారు. ఖాజీలుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు, అధికారులకు ఈ సందర్భంగా మహమ్మద్ హనీఫ్ కృతజ్ఞతలు తెలిపారు.



డిప్యూటీ సీఎం అంజద్‌బాషా చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న హనీఫ్

రీ సర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

గూడూరు రూరల్: భూముల రీ సర్వేకు రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను తీసుకుని వచ్చి అధికారులకు సహకరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ పేర్కొన్నారు. మల్లాపురంలో రీ సర్వేకు సంబంధించి ఆదివారం ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రీ సర్వేను సోమవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. భూములను కొలిచే సమయంలో రైతులు ఖచ్చితంగా ఉండాలన్నారు. భూమి మీద ఎంత వరకు సాగులో ఉన్నారనే విషయాలు తెలుసుకునేందుకు రైతులు అందుబాటులో ఉండాలన్నారు. రైతులు భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకుని రీ సర్వే జరుగుతున్న ప్రదేశానికి రావాలని సూచించారు.

ఎస్‌ఐ మల్లికార్జున సేవలు అభినందనీయం



ఎస్‌ఐ మల్లికార్జునకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు

ఓర్వకల్లు : రెండేళ్లుగా ఎస్‌ఐ మల్లికార్జున మండల ప్రజలకు నిస్వార్థంగా అందజేసిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రశంసించారు. ఎస్‌ఐ బదిలీపై వెళ్లతున్న సందర్భంగా ఆదివారం స్థానిక రాక్‌గార్డెన్ సమీపంలో గల ఏరో హోటల్ (ఏ1 హోటల్)లో వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని శివనరసింహారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి, నూతన ఎస్‌ఐ రాజారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల ఎస్‌ఐ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మల్లికార్జున పార్టీలకు అతీతంగా నిస్వార్థంగా పనిచేశారని కొనియాడారు. ఎక్కడా విమర్శలుగానీ, ఆరోపణలు ఎదుర్కొనకుండా పనిచేసిన ఘనత మల్లికార్జునరెడ్డికే దక్కిందన్నారు. కొత్తగా వచ్చిన ఎస్‌ఐ రాజారెడ్డి కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. మండలంలో ప్రధానంగా మట్కా, పేకాటలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అనంతరం ఇరువురు ఎస్‌ఐలకు జ్ఞాపికలు అందజేసి, బొకేలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్‌రెడ్డి, సర్పంచు తోట అనూష, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా పాల్గొన్నారు.

● కనుచూపుమేర పచ్చదనం



సి.బెళగల్ మండలం ముడుమాల శివారులో పచ్చగా కళకళలాడుతున్న వేరుశనగ పైరు

సి.బెళగల్: ఖరీఫ్ ప్రారంభ వర్షాలకు సాగు చేసిన పంటలకు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఊపరిపోశాయి. సి.బెళగల్ మండలంలోని తుంగభద్ర నదితీర గ్రామాలలో రైతాంగం సాగు చేసిన పంట పొలాలు కనుచూపుమేర పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. తిమ్మందొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాలలో సాగు చేసిన వేరుశనగ, పత్తి, ఉల్లి తదితర పంటలను పచ్చగా మెరుస్తున్నారు.

లారీ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామం వద్ద లారీ ఢీ కొట్టడంతో మహిళకు తీవ్రగాయాలపాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జిల్లా నాగలక్ష్మమ్మ నీళ్ల తెచ్చుకునేందుకు రోడ్డు పక్కన ఉన్న వడ్డే రామచంద్రుడు ఇంటి వద్దకు వెళ్లింది. బిందెను ఎత్తుకుని రోడ్డుకు ఎడమవైపు వస్తుండగా జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి టీఎస్31బీఎల్ 8754 నంబరుగల లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. నాగలక్ష్మమ్మ రెండు కాళ్లపై లారీటైర్లు ఎక్కిపోవడంతో కాళ్లు నుజ్జు నుజ్జయ్యాయి. తీవ్రగాయాలపాలనైన నాగలక్ష్మమ్మను 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె తమ్ముడు బింగి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

కిడ్నాప్ కేసు నమోదు

గడివేముల: మండల పరిధిలోని కొర్రపొలూరు గ్రామానికి చెందిన ఓ యువకుడిని కొంత మంది బొలెరోలో వచ్చి కిడ్నాప్ చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు .. కొర్రపొలూరు గ్రామానికి చెందిన చాబోలు మద్దమ్మకు ఇద్దరు కుమారులు. 20 రోజుల కిందట పెద్దకుమారుడు రువేన్ పెసరవాయి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల జ్యోతి (ఇద్దరు మేజర్లు) ఎవరికి తెలియకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం రువేన్ ఇంటి వద్దకు పెసరవాయి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నాగరాజు, కళావతి, సామేలు, లింకన్‌లు ఏపీ21 టీఈ 4623 బొలెరో వాహనంలో వచ్చారు. మా కుతూర్ని ఎక్కడ దాచి పెట్టారని వారి వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో చిన్న కుమారుడు ఆశోక్‌ను బొలెరో వాహనంలో బలవంతంగా ఎక్కించుకుని తీసుకువెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి

కర్నూలు(రూరల్): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని 26,27, 29,30 వార్డులలోని క్రిష్ణ నగర్, అబ్బాస్ నగర్, వెంకటాద్రి నగర్,శరీన్ నగర్‌లలో పాదయాత్ర చేశారు.

▪ ఊపందుకున్న ఖరీఫ్ సాగు!



ఎర్రదొడ్డిలో కంది విత్తనం వేస్తున్న రైతులు



వర్షాల రాకతో బైన్‌దొడ్డిలో పచ్చదనంతో కళకళలాడుతున్న కొర్ర, కంది పంటలు

కోడుమూరు రూరల్ : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. ముందస్తుగా సాగు చేసిన పత్తి, కొర్ర, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు తదితర పంటలకు ఈ వర్షాలు ఊపిరి పోశాయి. ఈ పైర్లు పచ్చగా కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా కురుడంతో రైతులు ఉల్లి, కంది, కొర్ర, జనుము తదితర పంటల సాగు చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు అన్ని రకాల పంటలను సాగు చేసుకునేందుకు అవకాశం ఉందని ఏఓ రవిప్రకాష్ చెబుతున్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు హెచ్చరించారు. ఆదివారం ఆ శాఖ ఆధ్వర్యంలో కర్నూలులోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గైర్హాజరు అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గూడూరు: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

'స్పందన'తో సమస్యల పరిష్కారం

కర్నూలు (న్యూటౌన్): ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంతో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'స్పందన' కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : మండలంలోని ముడుమల గుర్తిలో సోమవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డా.సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారని చెప్పారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొనాలని ఎంపీడీఓ సూచించారు.

పెద్దమ్మ గుడిలో చోరీ



పాణ్యం : మండల పరిధిలోని అనుపూరు గ్రామం వద్ద ఉన్న పెద్దమ్మ గుడి హుండీని దొంగలు పగులగొట్టి అందులో ఉన్న నగదు, ఐదు గంటలను ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మద్దూరు– అనుపూరు గ్రామాల మధ్య ఉన్న పెద్దమ్మ అమ్మవారి వద్ద ఏర్పాటు చేసిన హుండీని దొంగలు పగులగొట్టి, అందులో ఉన్న రూ.20వేల నగదు, ప్రాంగణంలో ఉన్న ఐదు గంటలను అపహరించుపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.